కథ

బేబే

అంగర వెంకట శివప్రసాదరావు

'సార్ మీరో టిక్కెట్టు తీసుకోండి...' 'మంగపతి నా టేబుల్ ముందు నిలబడి వినయంగా అడిగాడు. మంగపతి మా ఆఫీసులో గుమాస్తా.

'ఏదైనా చందానా....?' అడిగాను నేను.

'అలాంటిదే... అనుకోండి' అన్నాడు.

'లాంటిదే అంటే...' అంటూ అతని చేతిలో రసీదు పుస్తకం అందుకొన్నాను.

'మా పాలెంలో అంజనేయ స్వామి కోవెల కడుతున్నారు. డబ్బు లేక మధ్యలో ఆగిపోయింది' చెప్పాడు మంగపతి. 'అందుచేత లాటరీ పేరుతో టిక్కెట్లు అమ్ముతున్నారన్న మాట..' అన్నాను నేను.

'చందాలంటే డబ్బు పోగవడం కష్టం కదండీ...'

'దేవుడ్ని జూదంతో ముడి పెట్టారన్న మాట..'

'అబ్బె.. అదేం లేదండీ.. ఏదో ఎట్రాక్షన్ లేకపోతే జనాలు డబ్బు లివ్వరు కదండీ..'

రసీదు మీద మణికే మోటారు సైకిలుబొమ్మ కొట్టొచ్చినట్టు ప్రింటు చేశారు.

'మణికే మోటారు సైకిలు ఫస్టు ప్రైజండీ... మిగిలినవి వెనుక ప్రింటు చేశారు' నా మాపుల ప్రశ్నలకి జవాబు చెప్పాడు మంగపతి.

ఒక రసీదు మీద నా పేరు రాసి తీసుకొన్నాను. రెండ్రూపాయలు, రసీదు పుస్తకం తిరిగి మంగపతికి ఇచ్చేసాను.

'మిగిలిన ప్రైజులు కూడా చూడండి' అన్నాడు మంగపతి.

'ఆ... వస్తుందా.. వస్తుందా మిరొచ్చి అడిగారు కాబట్టి కొన్నాను' అంటూ టిక్కెట్టు జేబులో పెట్టేసుకున్నాను. మరో టేబుల్ దగ్గరకి వెళ్లిపోయాడు మంగపతి.

సాయంత్రం ఏదో వెతుకుతుంటే జేబులోంచి ఆ రసీదు బైటకొచ్చింది. యధాలాపంగా వెనక్కి తిప్పి చూసాను.

మొదటి బహుమతి: ఇండో సుజికి మోటారు సైకిలు

రెండవ బహుమతి: టేబుల్ ఫేను (ఉషా),

మూడవ బహుమతి: 12 లీటర్ల ప్రెషర్ కుక్కరు.

నాల్గవ బహుమతి: హెచ్.యం.టి. వాచీలు (ఇద్దరికి)

అయిదవ బహుమతి: హెచ్.ఇ.ఎస్ అలారం గడియారం(నలుగురికి)

100 టిక్కెట్లు కొన్న వారికి ప్రత్యేక బహుమతి. డాలో పోర్టబుల్ టి.వి.

సుమారు ఇరవై వేల రూపాయల ప్రైజులు. ఆ పుస్తకం అమ్మేస్తే మంగపతి పేరు పోర్టబుల్ టి.వి. డ్రాలో చేర్చబడుతుంది. అదృష్టం బావుంటే అతడికి ప్రైజు రావచ్చు.

మంగపతి ఏ పని చేసినా లాభం లేకుండా చెయ్యడు. వంద టిక్కెట్లు ముఫ్ఫై రూపాయలకే ఇచ్చి పుంటారు ఆ అలయ కమిటీవారు.

ఏదైతేనేం దైవకార్యం.

డ్రా తేదీ రెండు నెలల తరవాత. ఆఫీసు డ్రాయర్లో పడేసాను ఆ రసీదు. రెండు నెలలు పోయేక ఆ విషయం గుర్తొచ్చి మంగపతిని అడిగాను.

'లేదార్... అనుకొన్న టార్గెట్ రీచవ లేదు. డ్రాడేటు పొడిగించారు. 'ఏదో తన వల్ల తప్పు జరిగినట్టు తెగ బాధపడిపోయాడు మంగపతి.

ఆ తరువాత మరో నెలకి నేను అడక్కుండానే మంగపతే చెప్పాడు.

'ఫస్టు ప్రైజ ఆ ఆలయం కట్టే కంట్రాక్టరుకే వచ్చింది సార్. మిగిలిన కూడా ఎవరెవరికో వచ్చాయి. నా టిక్కెట్లలో ఎవరికీ ప్రైజు రాలేదండీ...!! అంటూ..

'ఆలయం పని మరుగ్గా సాగుతోందా?' అడిగాను నేను.

మంగపతి మొహం ఇబ్బందిగా పెట్టాడు.

'ప్రైజుల ఖర్చులు, రసీదు పుస్తకాల ఖర్చులు చిల్లర ఖర్చులు పోగా డబ్బేం ఎక్కువగా మిగల్లేదండీ...ఎక్కడ పని అక్కడే ఆగి పోయింది..' నెమ్మదిగా అన్నాడు మంగపతి.

ఈ మారు మంగపతి మొహం లో అంజనేయస్వామి ఏడుస్తూ కనిపించాడు నాకు.